యంగ్ తరంగ్

ఇటీవల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన భారత్.. రెండు వారాలు తిరిగే సరికి అదే ఆసీస్‌పై టీ20 సిరీస్ కైవసం చేసుకుంది. వరల్డ్‌కప్‌లో దుమ్మురేపిన రోహిత్, కోహ్లీ, రాహుల్, గిల్, జడేజా, షమీ, బుమ్రా, సిరాజ్ వీరిలో ఒక్కరు కూడా లేకుండానే.. కంగారూలపై మనవాళ్లు ట్రోఫీ నెగ్గారు. ఆస్ట్రేలియా జట్టులోనూ సీనియర్లు విశ్రాంతి తీసుకున్నారనేది నిజమే అయినా.. వ్యవస్థాగతంగా బలంగా ఉండే కంగారూలపై 4-1తో సిరీస్ గెలువడం చిన్న విషయమేం కాదు. సీనియర్లు లేకపోవడంతో అందివచ్చిన అవకాశాలను యువ ఆటగాళ్లు చక్కగా వినియోగించుకొని భవిష్యత్తుపై భరోసా పెంచుతున్నారు!

ఫైనల్లో తొమ్మిది మంది

ప్రపంచ జూనియర్ బాక్సింగ్ టోర్నీ

న్యూఢిల్లీ: అర్మేనియా వేదికగా జరుగుతున్న ఐబీఏ ప్రపంచ జూనియర్ బాక్సింగ్ టోర్నీలో తొమ్మిది మంది భారత బాక్సర్లు ఫైనల్లోకి ప్రవేశించారు. ఇందులో పాయల్ (48కి), నిశా (52కి), విని (57కి), శృతి (63కి), అకాంక్ష (70కి), మేఘ (80కి), జతిన్ (54కి), సాహిల్ (75కి), హేమంత్ (80కి) టైటిల్ పోరులో నిలిచారు. మరోవైపు సోమవారం జరిగిన వేర్వేరు బౌట్లలో హర్దిక్ పన్వర్ (80కి), అమీశా కెరెట్టా (54కి), ప్రాచీ (80కి) ప్రత్యర్థుల చేతుల్లో ఓడి రజత పతకాలు కైవసం చేసుకున్నారు.

వేడ్ వికెట్ నమ్మకం పెంచింది

బెంగళూరు : మూడు ఓవర్లలో 37 పరుగులు సమర్పించుకున్న బౌలర్‌కు చివరి ఓవర్లో బంతి అందించి పది పరుగులు ఇవ్వకుండా చేయాలంటే అతని మదిలో ఎలాంటి సంఘర్షణ చోటు చేసుకుంటుందో అర్ష్‌దీప్ సింగ్ ఆదివారం అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. ఆస్ట్రేలియాతో ఐదో టి20 మ్యాచ్‌లో గెలుపు కోసం పది పరుగులు చేయాల్సిన తరుణంలో జోరుమీదున్న వేడ్ బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాడు. తొలి బంతిని అర్ష్‌దీప్ బౌన్సర్‌గా వేశాడు. దానిని వైడ్‌గా ప్రకటిస్తారనుకున్న వేడ్ ఆశలు నెరవేరలేదు. రెండో బంతి యార్కర్‌గా దూసుకొచ్చింది. తొలి రెండు బంతులకు పరుగులు రాబట్టడంలో వేడ్ విఫలమయ్యాడు. ఫుల్‌లెంగ్త్‌లో వచ్చిన మూడో బంతిన వేడ్ సిక్సర్‌గా మలిచేందుకు ప్రయత్నించి లాంగాన్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు దొరికిపోయాడు. ఈ వికెట్‌తో తనలో గెలుపుపై నమ్మకం ఏర్పడిందని అర్ష్‌దీప్ మ్యాచ్ అనంతరం తెలిపాడు. తరువాతి మూడు బంతులకు సింగిల్స్ రావడంతో ఇండియా ఆరు పరుగులతో గెలుపొందింది. తనకు నచ్చిన విధంగా బౌలింగ్ చేసేందుకు కెప్టెన్ సహకరించాడని, అదే తనలో విశ్వాసం కలిగించిందని సింగ్ అన్నాడు.

అర్జున్, అస్లామ్ అదుర్స్ | ప్రొ కబడ్డీ లీగ్

అహ్మదాబాద్ : అర్జున్ దేశ్వాల్, కెప్టెన్ అస్లామ్ ఇనామ్‌దార్ ప్రతిభతో సోమవారం జరిగిన ప్రొ కబడ్డీ మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 37-33 స్కోరుతో గత చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌ను మట్టికరపించింది. అర్జున్ 17 పాయింట్లు, అస్లామ్ 10 పాయింట్లు సాధించారు. ఆరంభంలో జైపూర్ జట్టు ఆధిక్యంలో నిలిచినా, తరువాత అభినేష్ నటరాజన్, అజిత్‌కుమార్ పాయింట్లు కొల్లగొట్టడంతో పుణెరి జట్టు 14-10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పలుమార్లు ఆధిక్యం చేతులు మారిన మ్యాచ్‌లో చివరి నిమిషాలలో అర్జున్ విజృంభణతో జైపూర్‌కు విజయం దక్కింది.

మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 32-30 తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. బెంగాల్ జట్టులో మనిందర్ సింగ్ అత్యధికంగా 11 పాయింట్లు సాధించగా, బెంగళూరు జట్టులో భరత్(6) టాప్ స్కోరర్.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

మన దేశంలో ప్రతిభకు కొదవలేదని కొత్త కుర్రాళ్లు నిరూపించుకుంటున్నారు. రవి బిష్ణోయ్, యశస్వి జైస్వాల్, రింకూ సింగ్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ ఇలా అవకాశం వచ్చిన ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించి భారత విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. మ్యాక్స్‌వెల్, స్మిత్, సూర్యకుమార్ వంటి ఎందరో స్టార్ ప్లేయర్లు పాల్గొన్న సిరీస్‌లో రవి బిష్ణోయ్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడంటే.. అతడిలో ఏదో ప్రత్యేకమైన నైపుణ్యం ఉంది అని అంగీకరించక తప్పదు. బిష్ణోయ్ ఒక్కడే కాదు.. ఈ సిరీస్ ద్వారా రింకూ సింగ్ ఫినిషింగ్‌కు మరింత పేరు ప్రఖ్యాతులు రాగా.. ముఖేశ్ కుమార్ డెత్ ఓవర్స్ స్పెషలిస్ట్‌గా అవతరించాడు. దేశవాళీ, ఐపీఎల్ అనుభవంతో అంతర్జాతీయ క్రికెట్‌లో సత్తాచాటుతున్న యువ ఆటగాళ్లు మరికాస్త కష్టపడితే జట్టులో చోటు సుస్థిరం చేసుకోవడం పెద్ద కష్టమేం కాదు!

స్టార్లు ఉన్నా బెదరలేదు

వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఓడిన నాలుగో రోజే భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి టీ20 జరిగింది. అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, రవి, ముఖేశ్‌తో కూడిన భారత బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఆసీస్ తొలుత భారీ స్కోరు చేసింది. ఛేదన కష్టమే అనుకున్న తరుణంలో సూర్యకుమార్, ఇషాన్ కిషన్ రాణించి జట్టును గెలిపించారు. వన్డేల్లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన సూర్య.. తనకు అచ్చొచ్చిన ఫార్మాట్‌లో అటు బ్యాటర్‌గానూ.. ఇటు సారథిగానూ చక్కటి ప్రభావం చూపాడు. ఇక రెండో మ్యాచ్ విషయానికి వస్తే తొలుత టీమ్‌ఇండియాకు బ్యాటింగ్ చేసే అవకాశం రాగా.. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్ అర్ధశతకాలతో జట్టుకు కొండంత స్కోరు సాధించి పెట్టారు. బౌలింగ్‌లోనూ సత్తాచాటడంతో భారత్ సిరీస్‌లో ఆధిక్యంలో దూసుకెళ్లింది. మూడో పోరులోనైతే పరుగుల వరద పారింది. మొదట రుతురాజ్ గైక్వాడ్ భారీ సెంచరీతో భారత్ 222 పరుగులు చేయగా.. ఛేదనలో మ్యాక్స్‌వెల్ సునామీ సృష్టించడంతో ఆసీస్ సిరీస్‌లో కోలుకోగలిగింది. ఈ మూడు మ్యాచ్‌లనే తీసుకుంటే.. ఆ జట్టులో ఆస్ట్రేలియా అనుభవజ్ఞులతోనే బరిలోకి దిగింది. స్మిత్, షార్ట్, మ్యాక్స్‌వెల్, స్టాయినిస్, ట్రావిస్ హెడ్, మాథ్యూ వేడ్, ఆడమ్ జంపా, సీన్ అబాట్ ఇలా ప్రధాన ఆటగాళ్లు అందరూ అందుబాటులో ఉన్న సమయంలోనూ కంగారూలపై మనవాళ్లు పైచేయి కనబర్చారు. ఇక చివరి రెండు మ్యాచ్‌లకు ఆసీస్ ప్రధాన ఆటగాళ్లు స్వదేశానికి తిరిగి వెళ్లిన సమయంలోనైతే.. మన కుర్రాళ్లు సంపూర్ణ ఆధిపత్యం చూపారు.

అయినా కష్టమే!

దేశవాళీలతో పాటు ఐపీఎల్ లాంటి అత్యంత పోటీ ఉండే టోర్నీ ద్వారా రోజు రోజుకు మరింత రాటుదేలుతున్న కొత్తతరం.. అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తాచాటగలం అని నిరూపిస్తున్నది. అయితే వచ్చే ఏడాది వెస్టిండీస్, అమెరికా వేదికగా టీ20 ప్రపంచకప్ జరుగనుండగా.. అందులో ఎంత మంది యువ ఆటగాళ్లకు అవకాశం దక్కుతుందో చూడాలి. నిరుడు ఆస్ట్రేలియా వేదికగా జరిగిన పొట్టి ప్రపంచకప్ తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ ఫార్మాట్‌కు దూరం కాగా.. 2024 మెగాటోర్నీలోనూ ఈ ఇద్దరినీ ఆడించాలని బోర్డు యోచిస్తున్నది. ఇదే జరిగితే ద్వైపాక్షిక సిరీస్‌ల్లో సత్తాచాటి వెలుగులోకి వచ్చిన యువ ఆటగాళ్లకు నిరీక్షణ తప్పకపోవచ్చు. అయితే సమీప భవిష్యత్తులో భారత జట్టుకు వచ్చిన ఇబ్బందేమీ లేదని ఈ ప్రతిభావంతులు చాటిచెబుతున్నారు.

బవుమా, రబడకు విశ్రాంతి

భారత్‌తో సిరీస్‌లకు దక్షిణాఫ్రికా జట్టు ప్రకటన

జొహన్నెస్‌బర్గ్: టీమ్‌ఇండియాతో జరుగనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం టెంబా బువుమా, కగిసో రబడకు విశ్రాంతినిచ్చారు. ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌తో పాటు, వన్డే, టెస్టు సిరీస్‌లకు దక్షిణాఫ్రికా బోర్డు సోమవారం వేర్వేరు జట్లను ప్రకటించింది. 'బవుమా, రబడకు టీ20, వన్డే సిరీస్‌ల నుంచి విశ్రాంతినిచ్చాం. టెస్టు సిరీస్‌కు వీరిద్దరూ అందుబాటులో ఉంటారు' అని దక్షిణాఫ్రికా క్రికెట్ వెల్లడించింది. బవుమా గైర్హాజరీలో ఎయిడెన్ మార్క్‌రమ్ పరిమిత ఓవర్ల సిరీస్‌ల్లో సఫారీ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. మూడు జట్లలో కలిపి పలువురు కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇవ్వగా.. పేసర్లు కోట్జీ, ఎంగిడి, జాన్సన్‌ను వన్డేల నుంచి విశ్రాంతినిచ్చారు.

బవుమా

ఇంగ్లండ్‌పై వెస్టిండీస్ విజయం

అంటిగ్వా: కెప్టెన్ షై హోప్ (83 బంతుల్లో 109 నాటౌట్; 4 ఫోర్లు, 7 సిక్సర్లు) అజేయ సెంచరీతో కదం తొక్కడంతో ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో వెస్టిండీస్ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (71), జాక్ క్రాలీ (48), ఫిల్ సాల్ట్ (45), సామ్ కరన్ (38) తలా కొన్ని పరుగులు చేశారు. వెస్టిండీస్ బౌలర్లలో షెఫర్డ్, మోతీ, ఓషానో థామస్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో విండీస్ 48.5 ఓవర్లలో 6 వికెట్లకు 326 పరుగులు చేసింది. హోప్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించగా.. అలిక్ అథన్జే (66), రొమారియో షెఫర్డ్ (28 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు.

షై హోప్ (109*)

శివానీకి స్వర్ణం

స్విమ్మింగ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ పూల్ వేదికగా జరుగుతున్న 8వ జూనియర్, సబ్ జూనియర్ అంతరజిల్లాల స్విమ్మింగ్ టోర్నీలో శివానీ కర్ర పసిడి పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన బాలికల 100మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో శివానీ 1:14:03 టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. విలక్షణ పటేల్, అభినయ వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మరోవైపు బాలిక 50మీ ఫ్రీ స్టయిల్‌లో శిజు స్వర్ణం ఖాతాలో వేసుకుంది. విదుశి, వేదా అశ్రిత..రజత, కాంస్యాలు సొంతం చేసుకున్నారు.

షూటర్ బొటనవేలికి గాయం

న్యూఢిల్లీ : పిస్టల్ సిలిండర్ పేలి ఒక షూటర్ బొటనవేలు పాక్షికంగా చితికిపోయింది. గ్రీన్‌ఫీల్డ్‌లోని ఒక ప్రైవేట్ షూటింగ్ రేంజ్‌లో పిస్టల్‌కు గ్యాస్ ఎక్కిస్తుండగా సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన పుష్పేందర్ కుమార్ అనే షూటర్ భోపాల్‌లో జరుగుతున్న జాతీయ చాంపియన్‌షిప్ సందర్భంగా తన పిస్టల్‌లో గ్యాస్ నింపుతున్న సమయంలో ఈ సంఘటన జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అతడిన వెంటనే మిలటరీ ఆస్పత్రికి తరలించారు.

ఎనిమిదోసారి టాప్‌లో జొకో

లండన్ : నొవాక్ జొకోవిచ్ వరుసగా ఎనిమిదోసారి యేడాదిని టాప్ ర్యాంక్‌తో ముగించాడు. ఈ యేడాది మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీ టైటిల్స్‌లో అత్యధిక టైటిల్స్(24) సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఈ సీజన్‌లో జొకో మొత్తం ఏడు టైటిల్స్ తన ఖాతాలో వేసుకున్నాడు. స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కారజ్‌కు టాప్ ర్యాంక్ కోల్పోయినా, త్వరగానే తిరిగి దానిని సొంతం చేసుకున్నాడు. కాగా మహిళల టాప్ ర్యాంక్‌ను వరుసగా రెండో ఏడాది ఇగా స్వియాటెక్ నిలుపుకున్నది.

చిత్రం

యుద్ధానికి సమయం ఖరారు?

'ధూమ్' సిరీస్‌లో జాన్‌అబ్రహం, హృతిక్, ఆమీర్‌ఖాన్‌లు పోషించిన సూపర్‌హీరోస్ పాత్రలపై ఓ బుక్ రాయొచ్చు. భారతీయ వెండితెరకు హాలీవుడ్ హంగులద్దిన పాత్రలవి. వాటి ప్రేరణతో 'వార్' చిత్రాన్ని కూడా నిర్మించింది యష్‌రాజ్ సంస్థ. ఇప్పుడు 'వార్-2'కి రెడీ అయ్యింది. ఇందులో సూపర్‌హీరోగా మన టాలీవుడ్ స్టార్ తారక్ కనిపించనుండటం విశేషం. ఇది తెలుగు ప్రేక్షకులందరూ ఆనందించాల్సిన, గర్వించాల్సిన విషయమే. ప్రస్తుతం 'దేవర' షూటింగ్‌లో బిజీగా ఉన్న తారక్ 'వార్-2' షూటింగ్‌లోకి ఎంట్రీ ఇచ్చేదెప్పుడు? అనే విషయంపై గతంలో పలురకాల వార్తలు వచ్చాయి. లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే.. వచ్చే ఏడాది మార్చి రెండోవారం నుంచి తారక్ 'వార్-2' షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. రెండువారాలపాటు ఈ షెడ్యూల్ జరుగుతుందని తెలిసింది. మళ్లీ ఏప్రిల్‌లో 'దేవర' షెడ్యూల్‌లో పాల్గొంటాడు తారక్. మళ్లీ మే నెలలో 'వార్-2' షెడ్యూల్ ఉంటుందట. ఈ షెడ్యూల్‌లో హృతిక్, తారక్‌లపై యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించనున్నాడు. దీనికోసం హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌ని రంగంలో దించుతున్నారనేది లేటెస్ట్ న్యూస్. ఇక 'వార్-2' కథ విషయానికొస్తే.. ఇది ఇద్దరు స్నేహితుల కథ అని తెలుస్తున్నది. కొన్ని కారణాల వల్ల ఇద్దరూ విడిపోతారట. కానీ మంచి కోసం మళ్లీ కలిసి చెడుపై యుద్ధం చేస్తారట. ఆ ఇద్దరు స్నేహితులుగా హృతిక్, తారక్ నటిస్తుండగా, జాన్‌అబ్రహం ఇందులో నెగిటివ్ పాత్ర పోషించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. కైరా అద్వానీ కథానాయికగా ఖరారైనట్టు తెలుస్తున్నది.

మానవసంబంధాలు భావోద్వేగాల సమ్మేళనం

''సీతారామం'తో ప్రేక్షకులు నన్ను చూసే విధానం మారింది. నేను ఎంచుకునే పాత్రల విషయంలో కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అందుకే.. మనసుకు దగ్గరైన మంచి పాత్రలు చేయాలని నిశ్చయించుకున్నాను. 'హాయ్ నాన్న'లో నేను చేసిన 'యష్ణ' పాత్ర అలాంటిదే. ఇదో అద్భుతమైన కథ. విరాజ్, యష్ణ ప్రయాణాన్ని చూసిన ప్రేక్షకులు కచ్చితంగా వారితో ప్రేమలో పడిపోతారు.' అని మృణాళ్ ఠాకూర్ అంటున్నది. నాని జోడీగా ఆమె నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడు. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మాతలు. ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మృణాళ్ ఠాకూర్ విలేకరులతో ముచ్చటించింది. ' 'సీతారామం'లో సీత.. 'హాయ్ నాన్న'లో యష్ణ. రెండూ వైవిధ్యమైన పాత్రలే. 'సీతారామం' 60, 70ల్లో జరిగే కథ. 'హాయ్ నాన్న' నేటి తరానికి చెందిన కథ. ఇందులో నా పాత్ర కూడా ఇప్పటి అమ్మాయిలకు ప్రతిరూపంలా ఉంటుంది. ఈ పాత్రలో చాలా లేయర్లుంటాయి. మానవసంబంధాలు, భావోద్వేగాల సమ్మేళనం ఈ సినిమా. ఒక్కమాటలో చెప్పాలంటే 'డివైన్'. షూటింగ్ చేస్తున్నప్పుడు అదే భావనతో పనిచేశాం' అని చెప్పింది మృణాల్. నానీతో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభూతి అని, ఆయనతో నటిస్తుంటే పర్ఫార్మెన్స్ మరింత ఎలివేట్ అవుతుందని మృణాళ్ అన్నారు. అందరం నిజాయితీగా పనిచేశాం. చేస్తున్నప్పుడే గొప్ప సినిమా అని అర్థమైపోయింది. దర్శకుడు శౌర్యువ్‌తో పనిచేయడం వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్. తను క్రియేట్ చేసిన మ్యాజిక్‌ని ఈ నెల 7న చూస్తారు' అని చెప్పింది మృణాళ్. నిర్మాతలు రాజీ అనే పదానికి తావివ్వకుండా పాషన్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారని, సాంకేతికంగా అద్భుతం గా ఈ సినిమా ఉంటుందని ఆమె అన్నారు.

కమల్ నాయిక ఆమేనా?

కమల్‌హాసన్, మణిరత్నం.. అనగానే 'నాయకుడు' సినిమా గుర్తొస్తుంది. ఆ సినిమా వచ్చి 36ఏళ్లు నిండాయి. అంత సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కమల్‌హాసన్, మణిరత్నం కలిసి పనిచేస్తున్న సినిమా 'థగ్ లైఫ్'. ప్రకటన వచ్చిన నాటినుంచి ఈ సినిమాపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. విభిన్న కథలతో సినిమాలు చేసే మణిరత్నం.. కమల్‌తో చేయబోతున్న సినిమాకు ఏ తరహా కథను ఎంచుకొని ఉంటాడన్నది ఇప్పుడు సినీవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంచనాలకు అందని రీతిలో ఈ సినిమా కథ, కథనాలు ఉంటాయనేది చెన్నయ్ సమాచారం. ఇదిలావుంటే, ఇందులో కథానాయికగా త్రిష, నయనతార పేర్లు అప్పట్లో ప్రముఖంగా వినిపించాయి. ఆ తర్వాత ఐశ్వర్యరాయ్ దాదాపు ఖరారైనట్టు వార్తలు కూడా వచ్చాయి. అయితే, ఇప్పుడు వీరెవర్నీ కాకుండా మలయాళం కథానాయిక మంజు వారియర్‌ని హీరోయిన్‌గా ఫైనల్ చేశారనేది టాక్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నవి. ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.

ఆ రోజే టైటిల్ ప్రకటన

'కేజీఎఫ్' సిరీస్ చిత్రాలతో దేశవ్యాప్తంగా తిరుగులేని స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారు కన్నడ హీరో యష్. 'కేజీఎఫ్-2' తర్వాత ఆయన తదుపరి సినిమా కోసం దేశవ్యాప్తంగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యష్ చేయబోయే సినిమా ఎలా ఉంటుందోనని అందరిలో ఆసక్తి పెరిగింది. 'యష్-19' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా అప్‌డేట్‌ను అందించారు యష్. డిసెంబర్ 8న ఈ సినిమా టైటిల్ ప్రకటన ఉంటుందని తెలిపారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన దర్శకుడి వివరాలను యష్ వెల్లడించనప్పటికీ.. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వ బాధ్యతలను తీసుకోనున్నారని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమా లొకేషన్ సెర్చ్ కోసం యష్ శ్రీలంకలో పర్యటిస్తున్నట్లు సమాచారం.

నా కెరీర్‌లో గేమ్ ఛేంజర్ అవుతుంది

సుబ్రహ్మణ్యం, సుమంత్, సుధీర్‌బాబు, జ్ఞానశేఖర్

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. జ్ఞానసాగర్ దర్శకత్వంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. మాళవిక శర్మ కథానాయిక. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ఈ సందర్భంగా సోమవారం టీజర్ సక్సెస్ సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు. హీరో సుధీర్‌బాబు మాట్లాడుతూ 'బడ్జెట్ విషయంలో ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా నిర్మాతలు ఈ సినిమాను తెరకెక్కించారు. దర్శకుడు నన్ను కొత్తగా ప్రజెంట్ చేశాడు. టీజర్‌లో నా లుక్ అదిరిపోయిందని అందరూ అంటున్నారు. అన్ని కమర్షియల్ అంశాలతో పాటు ఎమోషన్స్ కలబోసిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ సినిమా నా కెరీర్‌లో గేమ్ ఛేంజర్ అవుతుందని బలంగా విశ్వసిస్తున్నా' అన్నారు. దేశవ్యాప్తంగా టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నదని, చేతన్ భరద్వాజ్ సంగీతం మరో స్థాయికి తీసుకెళ్లిందని దర్శకుడు జ్ఞానసాగర్ తెలిపారు. టీజర్‌కు వస్తున్న స్పందన సంతోషాన్నిస్తున్నదని, నిర్మాతగా తన తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలని నిర్మాత సుమంత్ జి నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

అచ్చ తెలుగు వరలక్ష్మి

అగ్ర హీరో నాగార్జున నటిస్తున్న తాజా చిత్రం 'నా సామి రంగ'. విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాస చిట్టూరి నిర్మాత. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తున్నది. సోమవారం ఆమె ఫస్ట్‌లుక్‌కు విడుదల చేశారు. వరలక్ష్మీ పాత్రలో ఆమె సంప్రదాయ దుస్తులు ధరించి ఆకర్షయణీయంగా కనిపిస్తున్నది. 'కంప్లీట్ మాస్ యాక్షన్ చిత్రమిది. నాగార్జున పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. కథానాయిక అషికా రంగనాథ్ అభినయ ప్రధానమైన పాత్రను పోషించింది. కథాగమనంలో ఆమె క్యారెక్టర్ కీలకంగా ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కథ, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ, సాహిత్యం: చంద్రబోస్, దర్శకత్వం: విజయ్ బిన్ని.

వినోదాల 'తికమకతాండ'

హరికృష్ణ, రామకృష్ణ, యాని, రేఖ నిరోష ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తికమకతాండ'. వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తిరుపతి శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు ఎంచుకున్న కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉంది. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఈ సినిమా సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నా' అన్నారు. ఆద్యంతం వినోదప్రధానంగా సాగే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: హరికృష్ణన్, సంగీతం: సురేష్ బొబ్బిలి, దర్శకత్వం: వెంకట్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.